క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



భార్గవ్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా బాడీబిల్డింగ్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వై.భార్గవ్ ప్రథమస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. బుధవారం కళాశాలలో భార్గవ్‌ను అభినందించి, విలేకరుకు వివరాలను వెల్లడించారు. ఇటీవల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 165 ప్లస్ ఎత్తు కేటగిరిలోని బెస్ట్ ఫిజిక్ ఇన్ మోడలింగ్ విభాగంలో భార్గవ్ ప్రథమ స్థానం సాధించినట్లు వేణు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, పీడీ ఎం.శ్రీనివాసరావు తదితరులు భార్గవ్‌ను అభినందించారు.

సాధారణ స్థాయిలోనే ప్రవాహాలు



సాధారణస్థాయిలో ప్రవహిస్తున్న ఉండి పంటకాలువ

ఉండి: మండలంలోని ఉండి కాలువ,పాటు బొండాడ డ్రెయిన్‌లలో బుధవారం ప్రవాహం సాధారణ స్థాయిలోనే ఉంది. బుధవారం వర్షం తగ్గడం వల్ల వరిపంట ముంపు నుంచి త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరద భయంతో అల్లాడిన యండగండి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

టార్పాలిన్స్ అందజేత

భీమవరం: పట్టణంలో దాతలకు కొదవలేదని మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్‌కు టార్పాలిన్స్ అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ సేవా దృక్పథంతో అందించిన టార్పాలిన్స్ స్కూల్ ఆవరణలో నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు నేలపై కూర్చోకుండా ఉపయోగపడతాయన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఎంవీ రామబద్రిరాజు, గోపిశెట్టి మురళీకృష్ణ, చెరుకువాడ రంగసాయి, స్కూల్ హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం

భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో భీమవరం బ్యాంక్ కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలు యడ్ల వేణుకు దాతలు కె.రమేష్, పాతూరి బాపిరాజు సమకూర్చిన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అంజిబాబు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, రమేష్‌బాబు, మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, కారుమూరి సత్యనారాయణమూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యూటన్

భీమవరం: బడికి వెళ్లే వయస్సు పిల్లలను పనికి పంపకూడదని ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు విద్యా హక్కు చట్టం కింద కార్పొరేట్ స్కూల్స్‌లో ఉచితంగా అడ్మిషన్స్ ఇస్తారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ అన్నారు. బుధవారం నాచువారిసెంటర్‌లో 24, 14 వార్డుల సచివాలయాల్లో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, బి.లోకేశ్వరరావు అసంఘటిత కార్మికుల హక్కులు, ముద్దాయిలకు అరెస్టుకు ముందు, అరెస్టు, రిమాండ్ సమయంలో ఉన్న న్యాయపరమైన హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి సర్విశెట్టి ఆదర్శనీయుడు

నరసాపురం: స్త్రీ పునర్వివాహాల కోసం ఉద్యమించిన పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి ఆదర్శనీయుడని బీజీబీఎస్ మహిళా కళాశాల అధ్యక్షుడు నూలి వెంకటరమణమూర్తి అన్నారు. సర్విశెట్టి 118వ జయంతిని ఆయన స్థాపించిన బీజీబీఎస్ కళాశాల వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణమూర్తి మాట్లాడుతూ సర్విశెట్టి సేవలను కొనియాడారు. ముందుగా రాయిపేటలో ఉన్న సర్విశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ట్రెజరర్ తుమ్మలపల్లి వీరభద్రరావు, కె.రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



భీమవరం అర్బన్: దిరుసుమర్రులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఉండి: మహదేవపట్నంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



కాళ్ల: బొండాడ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

భీమవరం అర్బన్: విధిగా పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిలకుమారి సూచించారు. మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనిలకుమారి మాట్లాడుతూ 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా రక్తహీనత రాకుండా గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లను అందిస్తున్నామన్ని స్పష్టం చేశారు. అనంతరం వివిధ ఆహారాలపై ఉండే పోషకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డీబీ కల్వరి, డి.దయామణి, ఎ.బేబిరాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ప్రాణాలకు రక్ష

ఉండి: పౌష్టికాహారం తల్లిబిడ్డ ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని మహదేవపట్నం సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రక్తహీనత అనేది చాలా పెద్ద సమస్య అని, దీని నివారణకు కచ్చితంగా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పోషకాహారంపై మహిళలకు క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.సూర్యకుమారి తెలిపారు. మండంలోని బొండాడ గ్రామంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాలు గురించి, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ నెల 30 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పట్టణ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలందించాలి

ఆకివీడు: స్థానిక సమతానగర్ రోడ్డులో నిర్మించి, ప్రారంభించిన అర్బన్ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభించాలని పౌరుల సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్ బీవీ.వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హెల్త్ సెంటర్ రూ.1.10 కోట్లతో నిర్మించి, ప్రారంభించినా సేవలందించకపోవడంతో రోగులు దూర ప్రాంతాలకు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. సేవలందించకపోవడంతో ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు పెచ్చుమీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత వైద్యులు వెంకటపతిరాజును వివరణ కోరగా ప్రారంభోత్సవం జరిగిందని, అయితే కొన్ని పనులు చేపట్టాల్సి ఉందని, సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రావడంలేదని తెలిపారు.

కొల్లేరు, ఉప్పుటేరు ప్రక్షాళనకు కేంద్రం నిధులివ్వాలి



సిద్ధాపురం గ్రామంలో ముంపు ప్రాంతాన్ని పడవపై పరిశీలిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: కొల్లేరు సరస్సు పరిధిలోని ఐదో కాంటూరు అభయారణ్య ప్రాంతం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నందున తక్షణం సరస్సు అభివృద్ధికి, సరస్సు అవుట్‌లెట్‌గా ఉన్న ఉప్పుటేరు ప్రక్షాళనకు నిధులు కేటాయించాలని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు విజ్ఞప్తి చేశారు. ఆకివీడు మండలంలో ముంపునకు గురైన కొల్లేరు తీర గ్రామాలు సిద్ధాపురం, కురుపాక, కాళింగగూడెం, చినమిల్లిపాడు, రాజులపేట, కోళ్లపర్రు, చినకాపవరం, గుమ్ములూరు, పెదకాపవరం, అప్పారావుపేట తదితర గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు, గోదావరి వరదలతో కొల్లేరు తీర గ్రామాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. ఐదో కాంటూర్ ఎగువ భూములు కూడా ముంపుబారిన పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరి, చేపలు, రొయ్యల చెరువులు ముంపునకు గురవ్వడంతో తీవ్ర ఆర్థిక నష్టాలకు గురవుతున్నారి ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి రెండు మూడేళ్లకోసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని వాపోయారు. ఉప్పుటేరు ప్రధాన డ్రెయిన్ పూడిక పనులు, ఆక్రమణల తొలగింపు, పంట, మురుగు కాల్వలకు షట్టర్ల నిర్మాణం వంటివి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి లక్షలాది మంది ప్రజల ఆస్తుల్ని, ఆదాయ మార్గాల్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, కేశిరెడ్డి మురళీ, ఇందుకూరి నారాయణరాజు, జంపన సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని కానిస్టేబుల్ శ్రీనివాస్‌పై దురుసుగా ప్రవర్తించిన కార్ డ్రైవర్ మణికంఠ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కాళీచరణ్ తెలిపారు. టౌన్ రైల్వేస్టేషన్ రోడ్డులో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మణికంఠ బుధవారం దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడంతో కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వీరవాసరం: వీరవాసరంలోని ఎస్‌వీఎస్ అండ్‌వీఈసి జూనియర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభువారం బుధవారం తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్ 50 శాతం ఉత్తీర్ణతతో పాసైనవారు అర్హులన్నారు. ఈ నెల 13 ఉదయం 10 గంటలకు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లు నకలు సర్టిఫికెట్‌తో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని వివరించారు,

మహిళ ఆత్మహత్య

పాలకోడేరు: భర్త, కుమారుడు మృతి చెందడంతో ఆ బాధ తట్టుకోలేక ఓ మహిళ ఉరేసుకుని మృతి చెందింది. శృంగవృక్షం గ్రామానికి చెందిన చింతపల్లి లక్ష్మి(43)భర్త వెంకన్న ఐదేళ్ల క్రితం అనారోగ్యం తో మృతి చెందగా ఇద్దరు బిడ్డలతో జీవిస్తోంది. కాగా పెద్ద కుమారుడు మానసిక అనారోగ్యంతో కొద్ది కాలం క్రితం కన్నుమూశాడు. అప్పటి నుంచి లక్ష్మి బెంగ పెట్టుకొని ఈ నెల 8న ఇంటి వెనుక ఉన్న పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. చిన్న కుమారుడు చూసి వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ బుధవారం లక్ష్మి మృతి చెందింది. చిన్న కుమారుడు ఫిర్యాదు మేరకు పాలకోడేరు రైటర్ అజరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

నరసాపురం రూరల్: పట్టణంలో గత నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించగా అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంగళగుంట పాలెం గ్రామానికి చెందిన గోరింకల ఆలీవర్‌ను ఎంపీపీ మైలాబత్తుల సోని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆలీవర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



ముత్యాలవారిపుంతలో రేషన్ బియాన్ని స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని యాళ్లవానిగరువు శివారు ముచ్చర్లవారిపుంతలో అక్రమంగా నిలువ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. తనకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి ముచ్చర్లవారిపుంతలో తాడి చిన్న అబ్బులు అద్దెకు ఉంటున్న ఇంటిపై దాడి చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. వీటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు దీనిపై చిన్నఅబ్బులను ప్రశ్నించగా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి మోటార్‌సైకిల్‌పై ఇంటింటికి తిరిగి రూ.16 చెల్లించి కొనుగోలు చేశానని, వీటిని కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన పి.గంగరాజుకి రూ.20 చొప్పున విక్రయిస్తానని చెప్పడంతో వీరు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏఓ పి.సురేష్ పాల్గొన్నారు.

జోరందుకున్న గణపతి నిమజ్జనాలు



కాళ్ల: కోపెల్లె గ్రామంలో వినాయకుని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



పాలకోడేరు: వేండ్రలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఉండి: మండలవ్యాప్తంగా గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోను పోటాపోటీగా నిమజ్జనాలకు వినాయకుని ప్రతిమలను తరలించారు. పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉండి, యండగండి, చిలుకూరు, మహదేవపట్నం, చెరుకువాడ గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో ఐదోరోజున వినాయకుని ఊరేగింపులు అట్టహాసంగా సాగాయి. పాలకోడేరుతో పాటు గొరగనమూడి కొండేపూడి, వేండ్ర, గొల్లలకోడేరు తదితర గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు ఆయా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: వినాయకచవితి ఉత్సవాలు ఐదో రోజు బుధవారం పలు మండపాల్లో గణపతి విగ్రహాల్ని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా తరలించారు. స్థానిక మాదివాడ, సాలిపేట, సంతపేటల్లోనూ, ఇతర ప్రాంతాల్లో బొజ్జ గణపయ్య ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అనంతరం స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో విగ్రహాల్ని నిమజ్జనం చేశారు. స్థానిక వర సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నారు.

కాళ్లలో..

కాళ్ల: అయోధ్య రాముని దేవాలయం నమూనాతో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం అందరినీ ఆకర్షిస్తుంది. వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన కాళ్ల రామాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అందరిని ఆకట్టుకునే విధంగా అయోధ్య రాముని దేవాలయ నామునలో ఏర్పాటు చేసిన గణనాథుని చూసేందుకు గ్రామంలోని భక్తులు గ్రామంలోని పురవీధుల గుండ బారులు తీరి స్వామివారి దర్శించుకున్నారు.



ఆకివీడు: సాలిపేటలో నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం



ఉండి: పెదపుల్లేరులో నిమజ్జనానికి వినాయకుడినితరలిస్తున్న నిర్వాహకులు

జీఓ-115ను రద్దు చేయాలి



పాలకొల్లు ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

పాలకొల్లు అర్బన్: సుమారు 18 ఏళ్ల నుంచి ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా ఏఎన్ఎంలకు 18 నెలల శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం–115ను తక్షణం రద్దు చేయాలని కోరుతూ బుధవారం పాలకొల్లు ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. 13 నుంచి 16 వరకు అత్యవసర విధులు మినహాయించి ఓపీ విధులు, సాధారణ వార్డు విధులు బహిష్కరణ చేసి రిలే దీక్షల్లో పాల్గొంటామని స్టాఫ్ నర్సులు విలేకరులకు తెలిపారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ విధులతో పాటు అత్యవసర విధులు కూడా బహిష్కరించి నిరవధిక దీక్షల్లో పాల్గొంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి జీవో నెం–115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి 18 నెలలు శిక్షణ ఇచ్చి జీఎన్ఎం స్టాఫ్ నర్సు ఉద్యోగాలు ఇవ్వడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనూరాధ, సునీత, విజయకుమారి, స్వప్న, వెంకటేశ్వరమ్మ, సుజాత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతం పరిశీలన



కొత్తనవరసపురం ఎస్టీ కాలనీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: భద్రాచలంలో వరద ఉధృతి తగ్గుముఖం పడుతుండడంతో నరసాపురంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. మండలంలోని కొత్తనవరసపురం ఎస్టీ కాలనీలోకి బుధవారం కొంతమేర వరదనీరు చేరింది. అప్రమత్తమైన రెవెన్యూ యంత్రాంగం పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వరద పరిస్థితిని తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ బెజవాడ సీతారత్నం వరద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇప్పటి వరకూ 11 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. 600 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లడంతో 1,008 మంది రైతులు నిరాశ్రయులయ్యారన్నారు. గురువారం నాటికి వరద పూర్తిగా తగ్గవచ్చని ఆమె తెలిపారు. వీరి వెంట వీఆర్‌ఓ కొప్పినీడి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

నరసాపురం రూరల్: పట్టణంలో గత నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించగా అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంగళగుంట పాలెం గ్రామానికి చెందిన గోరింకల ఆలీవర్‌ను ఎంపీపీ మైలాబత్తుల సోని బుధవారం పరామర్శించారు. ఇదే ప్రమాదంలో మరణించిన ఆలీవర్ మేనత్త కుటుంబ సభ్యులను కూడా కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆలీవర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నల్ల బ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన

మొగల్తూరు: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకువచ్చిన జీఓను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్లు నిరసన వ్యక్తం చేస్తూ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ తమ వైద్యవృత్తికి అన్యాయం చేసే జీఓ–85ను రద్దు చేయాలని కోరారు. గత కొన్ని నెలలుగా ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించుకుంటున్నా స్పందించకపోవడంతో రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిరసన తెలిపామన్నారు.

విద్యార్థులకు నవోదయ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: నవోదయ ఎంట్రన్స్ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని దాత శ్రీఖాకొల్లు కామేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్ష పుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కరణం పాపారావు పాల్గొన్నారు.

ఆకుకూరల్లో అనేక రకాల పోషక విలువలు



పాలకొల్లు అర్బన్: బల్లిపాడుగరువులో ఆకుకూరల ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఆకుకూరల్లో అనేక రకాల పోషక విలువలు ఉన్నాయని ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలు తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ కోరారు. మండలంలోని బల్లిపాడుగరువులో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. ఆకుకూరల్లో మునగ ఎక్కువగా తీసుకోవాలని, వీటిలో ఐరన్ శాతం ఎక్కువగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి, ఏఎన్ఎం టి.శార, అంగన్‌వాడీ టీచర్లు జె.గనికమ్మ, కె.సునీత పాల్గొన్నారు. అలాగే లయన్స్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం డి.సరళాప్రకాష్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహనను కలిగి ఉండాలని సీడీపీఓ ఊర్మిల, హెచ్‌ఎం మేరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పేర్కొన్నారు. మండలంలోని చినమామిడిపల్లి కొత్తకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మహాన్ కార్యక్రమం నిర్వహించారు.